క్లుప్తంగా

జగనన్న ప్రగతి పథం పోస్టర్ ఆవిష్కరణ



జి.కొండూరు: వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న విజయవాడలో నిర్వహించనున్న జగనన్న ప్రగతి పథం ర్యాలీ పోస్టర్లను ఐటీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ వేములకొండ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ఐతవరంలోని ఆయన నివాసంలో గురువారం విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ఈ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.

20 నుంచి పత్తి కొనుగోలు

మైలవరం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఈ నెల 20వ తేదీ నుంచి పత్తి కొనుగోలు ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులో క్వింటా పత్తికి రూ.7,020 ధర చెల్లిస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగుల చవితికి ఏర్పాట్లు

నూజివీడు: మండలంలోని అన్నవరంలో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితికి ఏర్పాట్లు చేసినట్లు అలయ అర్చకులు భావరాజు పుల్లారావు గురువారం తెలిపారు. ఉదయం ఆరు గంటలకు సర్పసూక్త అభిషేకం , శివ సహస్రనామార్చన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహస్ర నామార్చన, నాగదేవత అష్టోత్తర పూజలు నిర్వహిస్తామన్నారు. పుట్టలో పాలు పోసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

సామూహిక సత్యసాయి వ్రతాలు

తిరువూరు: సత్యసాయి సేవా సమితిలో సాయి బాబా 98వ జన్మదిన వేడుకలలో భాగంగా గురువారం సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. 108 సార్లు గాయత్రీమంత్రం జపించడంతో పాటు సత్సంగం, ఓంకారం, నగర సంకీర్తన, సహస్రనామార్చన జరిపారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

తిరువూరు: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రంథాలయాలను విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమలపూర్ణమ్మ అన్నారు. తిరువూరు శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో గురువారం ఆమె పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ఆమె బహుమతి ప్రదానం చేశారు. పద్మావతి పాల్గొన్నారు.

మైలవరం: గ్రంథాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి.జమల పూర్ణమ్మ తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సిబ్బంది నాగార్జున, సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ తెలుగు పండితులు డి.వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వక్తలతో ప్రసంగాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, సంస్కృత పండితులు తాండవకృష్ణ, ఉపాధ్యాయుడు ఎంఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని చనుబండ హైస్కూలు ఉపాధ్యాయురాలు కిరణ్మయి తెలిపారు. గురువారం గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.



గ్రంథాయలయ ఉద్యమకారుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



విద్యార్థులను అభినందిస్తున్న జమలపూర్ణమ్మ తదితరులు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

రెడ్డిగూడెం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నిర్వహించారు. గ్రంథాయల ఉద్యమ మహనీయుల వివరాలను జెడ్పీ స్కూల్ హెచ్ఎం ధర్మశీల విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గీతాంజలి, నారాయణ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. డి. విజయలక్ష్మి భాస్కరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలుగా విరాజిల్లుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ టి.జమలపూర్ణమ్మ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొండపల్లి గ్రంథాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. గ్రంథాలయాల ఆవశ్యకత, ప్రజలు, విద్యార్థులు ఉపయోగించుకుంటున్న తీరు వివరించారు. జూనియర్ విద్యార్థులకు నేటి సమాజంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత, సీనియర్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, గ్రంథాలయ అధికారులు రాంబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గొల్లపూడి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, కార్యదర్శి ఎంపీడీటీ. నగేష్‌లు విచ్చేసి పరిశీలించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించామని ఎం. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

జి.కొండూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఉద్యమకారుడైన అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రన్నింగ్, మ్యూజికల్ చైర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. జెడ్పి హైస్కూలుకు చెందిన 30 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయాధికారి వి.విజయకృష్ణ తెలిపారు.

ఆగిరిపల్లి: విద్యార్థులంతా పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం విద్యార్థులతో మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు.

ముసునూరు: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం గోపవరం శాఖ గ్రంథాలయంలో శాఖాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో 'నేటి విద్యలో క్రీడల పాత్ర–ప్రాముఖ్యత' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థి జీవితంలో గ్రంథాలయాలు–మాతృ భాష తెలుగు ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయుడు హుస్సేన్ వివరించారు.

అట్టహాసంగా ఎంపీపీ దుర్గా భవాని ప్రమాణస్వీకారం

ముసునూరు: మండల పరిషత్ అధ్యక్షుల పదవీ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ముసునూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నూజివీడు డీఎల్‌డీఓ, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి పి.వెంకటరత్నం అధ్యక్షతన ఎంపీటీసీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీగా రమణక్కపేట ఎంపీటీసీ సభ్యురాలు కొండా దుర్గా భవానిని లోపూడి ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన ప్రతిపాదించగా, కాట్రేనిపాడు–2 ఎంపీటీసీ సభ్యురాలు, మాజీ ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి బలపరిచారు. ఎంపీపీ పదవికి ఇతరులెవ్వరూ పోటీకి రాకపోవడంతో మండల పరిషత్ అధ్యక్షురాలిగా దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. అనంతరం ఆమెతో ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీఓ జి.రాణి, ఈఓపిఆర్డీ బీఏ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ పి.గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, పార్టీ మండల అధ్యక్షుడు ఎంనాగవల్లేశ్వరరావు తదితరులున్నారు.



ఎంపీపీ దుర్గాభవానిని సన్మానిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించండి

ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి

గంపలగూడెం: ప్రజలకు మంచిచేసిన ప్రభుత్వాన్ని 2024లో మరోమారు ఆదరించాలని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి తెలిపారు. గంపలగూడెం–2 సచివాలయం పరిధిలో గురువారం రాత్రి పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యాలయం వద్ద అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. స్థానిక గౌడబజారు మూడు రోడ్ల సెంటర్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల నరసింహారావు, మాజీ ఎంపీపీ కోట దాసు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లు కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నరసారెడ్డి, టి. చెన్నకేశవరెడ్డి, కొత్తగుండ్ల వంశీ, కోట సునీల, మండల పరిషత్ కో ఆప్షన్ నెంబర్ షేక్ కరీం, ఎస్.చంద్రశేఖర్, అచ్చియ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, పార్టీ శ్రేణులు

ఎన్టీటీపీఎస్‌లో భద్రతపై శిక్షణ

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని ఏపీ జెన్‌కో శిక్షణ కేంద్రంలో సురక్షితమైన భద్రతపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత పరమైన నియమాలు పాటించకపోవడం వలన అనేక ప్రమాదాలు మానవ తప్పిదంతో జరుగుతున్నాయని చెప్పారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జీరో స్థాయిలో ఉండేలా భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పని ప్రదేశాల్లో సైతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జిల్లా వ్యాప్తంగా వివిధ ఫ్యాక్టరీలకు చెందిన 175 మంది శిక్షణకు హాజరయ్యారు. డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాసరావు, సీతః నవీన్‌గౌతమ్, ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌వర్మ

విప్లవాత్మకంగా సంక్షేమ పథకాలు

తిరువూరు: సంక్షేమ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తున్నాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. గురువారం సాయంత్రం తిరువూరు 18వ వార్డు సచివాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని కస్తూరిబాయి ఆవిష్కరించారు. ప్రతి కుటుంబ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాజకీయాలకతీతంగా ఈ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు దారా నీలిమ, పరసా శ్రీనివాసరావు, నడిం తిరువూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గజ్జల సీతారామారావు, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన పాలకవర్గ సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, వైఎస్సార్సీపీ నాయకులు షేక్ జాకీర్, పరసా నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జీకొత్తూరు(తిరువూరురూరల్): ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తున్నామని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. మండలంలోని జీకొత్తూరులో గురువారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించిన నాగనర్సిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ళలో రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపీపీ గద్దల భారతి, గ్రామ పార్టీ నాయకులు శీలం కృష్ణారెడ్డి, ఈవోపీఆర్‌డీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

పెనుగొలను(గంపలగూడెం): 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలను శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. ముందుగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెకుముకి రచయిత ఎం. రామ్ ప్రదీప్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న అయ్యంకి వెంకటరమణయ్య, నాగభూషణం, వెలగ వెంటప్పయ్య, గాడిచర్ల పూరి సర్వోత్తమ రావుల గురించి వివరించారు. జేవీవీ సభ్యులు పాపారావు విద్యార్థులకు సైన్సు మూఢ నమ్మకాల గురించి ఇంద్రజాల ప్రదర్శనతో వివరించారు. పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు, జేవీవీ ప్రధాన కార్యదర్శి బి. సైదులు, సాయిబాబా సేవ కమిటి సభ్యులు వి. నారాయణరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు జి. శ్రీలత, పాఠకులు పాల్గొన్నారు.



పెనుగొలనులో ఇంద్రజాల ప్రదర్శన నిర్వహిస్తున్న పాపారావు

నట శేఖరునికి జన నీరాజనాలు

ముసునూరు: జానపద, పౌరాణిక, సాంఘిక, కుటుంబ కథానాయకుడుగా పలు పాత్రలలో నటించి, జీవించి, తన హావభావాలతో, సినీ రంగంలో డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా అభిమానుల హృదయాలలో నిలిచిపోయిన సూపర్‌స్టార్ కృష్ణ సదా స్మరణీయులని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు పేర్కొన్నారు. చెక్కపల్లి సెంటర్, వాటర్‌ట్యాంక్ సెంటర్లలో ఆ సమాఖ్య, కృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నటశేఖరుడు దివంగత కృష్ణ వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, పౌరాణిక నాటక కళాకారులు కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కళాకారులు, అభిమానులు శ్రీనివాస్, రాంబాబు, సత్యనారాయణ, రామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

104 సేవలను వినియోగించుకోవాలి

ముసునూరు: జగనన్న ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని చెక్కపల్లి ఎంపీటీసీ సభ్యురాలు తోట రమాదేవి అన్నారు. మండలంలోని చెక్కపల్లి వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ వద్ద గురువారం 104 వాహనం ద్వారా నిర్వహిస్తున్న వైద్య సేవలను ఆమె పరిశీలించారు. పార్టీ నేతలు మురళి, భాస్కర్, సంపతరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయనపాడు ఉప సర్పంచ్‌గా రాజేష్

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామ ఉపసర్పంచ్‌గా కలపాల రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఉప ఎన్నికలో సర్పంచ్ కాటంనేని కళ్యాణి, 12 మంది పాలకవర్గ సభ్యుల్లో ఏడుగురు సభ్యులు కలపాల రాజేష్‌కి మద్దతు తెలపడంతో ఆయన ఉపసర్పంచ్‌గా ఎన్నికయినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు ప్రకటించారు. మొదటి రెండున్నర సంసవత్సరాలు పెయ్యల విజయలక్ష్మీ ఉపసర్పంచ్‌గా పనిచేయగా, రెండవ దఫా కలపాల రాజేష్ ఎన్నికయినట్టు గ్రామ కార్యదర్శి స్వరూపరాణి తెలిపారు. ఉపసర్పంచ్‌గా గెలుపొందిన పత్రాన్ని ఎంపీడీఓ శేషగిరిరావు, సర్పంచ్ కాటంనేని కళ్యాణి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు అందజేశారు.

నేటి నుంచి గొల్లపూడి అయ్యప్ప సన్నిధిలో కార్తిక మాసోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గొల్లపూడి శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం సన్నిధిలో ఈ నెల 17 నుంచి కార్తిక మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు గెల్లి మోహనరావు తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కేరళ సంప్రదాయ పద్ధతుల్లో స్వామి వారికి వైదిక కైంకర్యాలు, ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 17 నుంచి జనవరి 13వ తేదీ వరకూ మహా దీపార్చన నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 27 వరకూ మండల పూజా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముఖ్యమంత్రి సభకు ప్రజలు తరలిరావాలి

చాట్రాయి: నూజివీడులో శుక్రవారం నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలిరావాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోరుకునే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో జనరంజక పాలన

ముసునూరు: రాష్ట్రంలో జగనన్నది జనరంజక పరిపాలన అని జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ వరికూటి ప్రతాప్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నూతన ఎంపీపీ కొండా దుర్గాభవాని ప్రమాణ స్వీకారం అనంతరం, వైస్ ఎంపీపీలు కోటగిరి రాజానాయన, పి.గంగాధర్, ఎంపీటీసీ సభ్యులతో కూడిన మండల పరిషత్ కార్యవర్గానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన గురువారం అభినందన సభ నిర్వహించారు. నేతలు రాపర్ల సుబ్బారావు, కొండా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బాల బాలికలకు చిత్రలేఖనం పోటీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ కో ఆర్డినేటర్ కె. ప్రియాంక పర్యవేక్షణలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ప్రియాంక విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోమటి శ్రీనివాసరావు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎ.ఈశ్వరి, ఉపాధ్యాయులు టి. ప్రసన్న, వై. లక్ష్మీ, కేవీ శేషుకుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తిరువూరు: బాలికలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని సమగ్ర స్త్రీ శిశు అభివృద్ధి ప్రాజెక్టు సీడీపీవో సత్యవతి అన్నారు. స్థానిక షాదీఖానాలో తిరువూరు ప్రాజెక్టు పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి బాలల హక్కుల ఫౌండేషన్ బాల్య వివాహాల నిరోధం, బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేసే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు. న్యాయవాదులు మాకరాజు రాంమోహన్‌రాజు, జీవన్‌బాబు, బాలల హక్కుల ఫౌండేషన్ ప్రభాకర్, నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అనంతరం బాలల హక్కులు పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న తిమ్మారెడ్డి. పక్కన ఎంఈఓ బాలు తదితరులు

మైలవరం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దాత కుడుముల తిమ్మారెడ్డి తెలిపారు. మైలవరం మండలం వెల్వడం సరస్వతీ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5000, తృతీయ బహుమతి రూ. 3000 గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాజీస్వామి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, జడ్పీటీసీ సభ్యులు ఎస్. తిరుపతిరావు, ఎంఈఓ ఎల్.బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

గంపలగూడెం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయు రాజీలేని పోరాటం చేస్తుందని పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు నవాబ్ జానీ అన్నారు. గంపలగూడెం మండలంలో పీఆర్టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా పోరాడి తన సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. మోడల్ స్కూల్లో టీచర్లకు0/0 అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని, ఖాళీలను కారుణ్య నియామకం ద్వారా భర్తీ చేయాలని కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టారు. పీఆర్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయశీలన్ రావు, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ కాంగ్రెస్‌కు జెడ్పీ బాలిక ఎంపిక



చట్టు వెంకట భార్గవి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికోన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని చట్టు వెంకటభార్గవి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బి.పద్మలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఫుడ్ పాయిజన్ కారణాలు, దాని పరిణామం, నివారణపై మినీ ప్రాజెక్ట్ ఆవిష్కరించింది. జిల్లా విద్యాశాఖ అధికారుల బృందం ప్రాజెక్ట్ పరిశీలించి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 18న విజయవాడ లయోలా కళాశాలలో జరగనున్న 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పూర్తిస్థాయి మెటీరియల్‌తో ప్రదర్శ ఇస్తుందని తెలిపారు. బాలికను అందరూ అభినందించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



జి.కొండూరు: మండల పరిధిలోని సున్నంపాడు గ్రామ మాజీ సర్పంచ్ , శతాధిక వృద్ధురాలు దేశం లక్ష్మమ్మ (101) బుధవారం అర్ధ రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆమె అంత్యక్రియలను గురువారం నిర్వహించారు. సర్పంచ్‌గా లక్ష్మమ్మ చేసిన సేవలను పలువురు కొనియాడారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. విస్సన్నపేట సచివాలయం -4 పరిధిలో పల్లెకు పోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రక్షణనిధి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను పేదలకు అందించారని చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో సంక్షేమం, అభివృద్ధి రూపంలో కోట్లాది రూపాయి వెచ్చించామని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపర్చారన్నారు. రూ.5 కోట్లతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ శివాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఎంపీటీసీ జి.మల్లయ్య, పార్టీ నాయకులు రెడ్డి శేషగిరి, పిల్లి రాజేష్, కోటా శ్రీను పాల్గొన్నారు.

జూపూడి(ఇబ్రహీంపట్నం):సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమయిందని, ప్రజా సంక్షేమం కోసం మరలా సీఎంగా జగనన్న ఉండేందుకు ప్రజలు ఆశీర్వదించాలని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. జూపూడి సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకుపోదాం కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రూ.34.05 కోట్లతో చేపట్టిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలతో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ బి.నాగబాలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బి.సాంబశివరావు, దుర్గగుడి కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్ కోసూరు వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్‌లు గొర్నేని గాంధీ, జానీ, అధికారులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ఒకటో సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు జెండా ఆవిష్కరించి రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ ఫలాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, మిక్కిలి శరభయ్య, ఎస్.శివశంకరరావు, గుంజా శ్రీనివాస్, దయాకర్, ఆనంద్, పండు, రాధ, తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి తదితరులు

సంక్షేమాభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం

జి.కొండూరు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండల పరిధి మునగపాడు గ్రామ సచివాలయ పరిధిలో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును నాయకులు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసిన నాయకులు, గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పేదల అభ్యున్నతికి మళ్లీ జగన్ కావాలి

రెడ్డిగూడెం: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండలంలోని మద్దులపర్వ గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ద్వారా ఈ ప్రభుత్వంలో జరుగుతున్న మంచి గురించి ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు బొలగాని తిరుపతిరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, రైతు సలహా మండలి అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరెడ్డి, పాలంకి రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొలుసు గంగాధర్, గ్రామ సచివాలయ కన్వీనర్ దాసరి గురవయ్య,పంచాయతీ కార్యదర్శి షేక్ మీరా సాహెబ్ తదితరులున్నారు.



పేదరికం నిర్మూలనకు ప్రభుత్వం కృషి

- కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ తాతినేని పద్మావతి
- నూతన భవన సముదాయం ప్రారంభం

గంపలగూడెం: పేదరికం నిర్మూలన కోసం రాష్ట్రంలో గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ తాతినేని పద్మావతి అన్నారు. గంపలగూడెంలో రూ.2.58 కోట్లతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ నూతన భవన సముదాయన్ని ఆమె తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పద్మావతి మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు కళ్లు తెరచి మండల కేంద్రాలు, గ్రామాల్లో జరుగుతున్న పనులు చూడాలని సూచించారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా దేశం అబ్బురపడేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యస్థాపనకు, అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్ని అభివృద్ధి చేసి మెరుగైన విద్యనందిస్తుందని పేర్కొన్నారు. కేడీసీసీ బ్యాంక్ ద్వారా సొసైటీల పరిధిలో రైతు ప్రయోజనాలకు పంట రుణాలే కాకుండా పంపిణీ చేస్తున్న వ్యవసాయేతర రుణాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కేడీసీసీ బ్యాంక్ ద్వారా తమ అవసరాలకు రుణాలు పొందుతున్న రైతులు పంటచేతికి వచ్చి విక్రయించిన సమయంలో నగదు డిపాజిట్లు చేసి బ్యాంక్‌ను ఆదరించాలన్నారు. గంపలగూడెం నూతన బ్యాంక్ భవనంలో ఎక్కువ మంది ఖాతాదారులకు లాకర్ వసతి, ఏటీఎం వసతి కల్పించామన్నారు.



కేడీసీసీ బ్యాంక్ నూతన భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న పద్మావతి, రక్షణనిధి

జిల్లాలో గంపలగూడెం బ్రాంచి ప్రథమస్థానం: ఎమ్మెల్యే రక్షణనిధి

ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని 49 బ్రాంచిల్లో గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ బ్రాంచి రూ.374 కోట్ల టర్నోవర్‌తో ప్రథమస్థానంలో ఉందని ఎమ్మెల్యే రక్షణనిధి అన్నారు. వసతులతో కూడిన సొంత భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొంటుందన్నారు. బ్యాంక్ సీఈఓ శ్యామ్‌మనోహర్ మాట్లాడుతూ గంపలగూడెం బ్యాంక్‌లో రైతులకు డిపాజిట్ల కంటే రెట్టింపు రుణాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రజలు తగిన డిపాజిట్లు చేసి బ్యాంక్‌ను ఆదరించాల్సి ఉందన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, బ్యాంక్ డైరెక్టర్లు బి.రాణి, పి.సుజాత, ఏఎంసీ ఛైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, సర్పంచ్ కోట పుల్లమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నర్సారెడ్డి, జి. చెన్నకేశవరెడ్డి, వేములకొండ రాంబాబు, బ్యాంక్ సీఈఓ శ్యామ్‌మనోహర్, చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు, మండల పరిధిలోని 12 పీఏసీఎస్‌ల అధ్యక్షులు, సీఈఓలు, బ్యాంక్ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





